క్లుప్తంగా

నేడు ఈడుపుగల్లులో రెవెన్యూ సదస్సు

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో ఈనెల 26న రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వి.భావనారాయణ తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు జరుగుతుందన్నారు. గ్రామస్తులు రెవెన్యూ సమస్యలను సదస్సులో అర్జీల రూపంలో అందించాలని, అర్జీలను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

గన్నవరంరూరల్: ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ప్రభుత్వం ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలను అందజేస్తుందని మండల హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ పేర్కొన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఒక్కొక్క ఆయిల్ పామ్ మొక్క రూ.193లు కాగా, ఒక్క హెక్టారుకు 143 మొక్కలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని చెప్పారు. వీటికి రూ.27,599 సబ్సిడీ లభిస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటల కోసం రైతులకు ప్రతి హెక్టారుకు రూ.5,250లు చెల్లిస్తారని చెప్పారు. ఈ ప్రయోజనం నాలుగేళ్ల పాటు రైతులకు అందుతుందన్నారు. ఆయిల్ పామ్ సాగు నిర్వహణ కోసం ప్రతి హెక్టారుకు సంవత్సరానికి రూ.5,250లు అందజేస్తామన్నారు. ఇది కూడా నాలుగేళ్ల పాటు రైతులకు అందిస్తామని చెప్పారు. ఈ పథకం రైతులకు ఆర్థికంగా మద్దతు ఇచ్చి ఆయిల్ పామ్ సాగు పెంపొందించేందుకు తోడ్పడుతుందని హరిచంద్ తెలిపారు.

అనాథలకు అన్నదానం



పెనమలూరు: యనమలకుదురుకు చెందిన మెండెం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ 200 మంది అనాథలకు అన్నదానం చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి యనమలకుదురు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో రోడ్ల పక్కన నివశిస్తున్న అనాథలకు భోజనం పెట్టారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు వీరంకి కీర్తి మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా కొద్ది సంవత్సరాలుగా అనాథలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు.

దాడి చేసిన తండ్రి, కుమారుడిపై కేసు నమోదు

పెనమలూరు: ఆర్థిక పరమైన విషయంలో దంపతులపై తండ్రి, కుమారుడు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి శ్రవణ్ ఎన్‌క్లేవ్‌లో మాదల తనూజ, భర్త సతీష్ బాబుతో నివాసం ఉంటున్నారు. తనూజ తన బాబాయి మాదల ప్రసాద్ వద్ద నగదు అప్పుగా తీసుకొని వడ్డీతో సహా తిరిగి చెల్లించారు. అయితే తమకు అధిక వడ్డీ కావాలని ప్రసాద్, అతని కుమారుడు ఓంప్రకాష్ తనూజ, సతీష్‌బాబును అనేక సార్లు బెదిరించారు. వీరు ఉంటున్న అపార్టుమెంట్ వద్దకు వచ్చి దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

విద్యుత్ వైర్ల చోరీపై కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలోని ఓ వెంచర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ వైర్లు చోరీ చేసిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకిలో విశిష్ట వెంచర్‌లో రూ.2.20 లక్షల విలువ చేసే విద్యుత్ వైర్లు స్టోర్ రూమ్‌లో ఉంచారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు స్టోర్‌రూమ్ తాళాలు పగుల కొట్టి వైర్లు చోరీ చేశారని వెంచర్ సూపర్‌వైజర్ యలమంచిలి వెంకటసాంబశివరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హేలపురి బాలోత్సవం నిర్వహణకు విరాళం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హేలపురి బాలోత్సవం నిర్వహణకు మానవత హనుమాన్ జంక్షన్ శాఖ తరుపున రూ.36 వేలు విరాళాన్ని అందజేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో హేలపురి బాలోత్సవం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, నిర్వాహక కార్యదర్శి జీవీఎల్ నరసింహారావులకు బుధవారం నగదును అందించారు. మానవత రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు రూ.30 వేలు, విశ్రాంత ఎంఈవో గంటా సత్యనారాయణ, ఇందిరాదేవి దంపతులు రూ.6 వేలు చొప్పున విరాళం అందజేశారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- బాలఏసును ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు
- చర్చిలకు పోటెత్తిన భక్తులు



కంకిపాడులో క్రీస్తు సందేశమిస్తున్న విచారణ గురువు, ఫాదర్ సాల్మన్‌రాజు



పెద్ద అవుటపల్లిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఫాదర్లు

కంకిపాడు: క్రీస్తు బోధనలు అనుసరణీయమని విచారణ గురువులు పేర్కొన్నారు. క్రీస్తు పుట్టుకను స్వాగతిస్తూ, బాల ఏసును ఆరాధిస్తూ తెల్లవారు జాము వరకు చర్చిలు, ప్రార్థ నామందిరాల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తును స్తుతించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో విశేష ప్రార్థనలు నిర్వహించారు. కంకిపాడు ఆరోగ్యమాత దేవాలయంలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విచారణ గురువు, ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, శాంతి, సహనం మార్గంలో పయనించాలన్నారు. తోటివారికి సహాయ పడుతూ ఉన్నత విలువలతో మెలగాలన్నారు. సంఘ పెద్దలు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పాల్గొని విశ్వాసులకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని 650 చర్చిలు, ప్రార్థన మందిరాల్లో 50 వేల మంది విశ్వాసులకు మిఠాయిలను క్రిస్మస్ కానుకగా అందజేశారు.

పెనమలూరులో ప్రార్థనలు

పెనమలూరు: మండల వ్యాప్తంగా చర్చిల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భక్తుల సందడి నెలకొంది. కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో క్రీస్తు జన్మదిన వేడుకలు విచారణ గురువు ఫాదర్ చలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దివ్య బలి పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పశువుల పాక, 15 అడుగుల క్రిస్మస్ తాత అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు దివ్య ప్రసాదం అందజేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, గాయక బృందం, దళ సభ్యులు యూత్ సభ్యులు పాల్గొన్నారు. పోరంకి బీజేఆర్‌నగర్, యనమలకుదురు, వణుకూరు, గోసాల, పెనమలూరు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా చేశారు.

గన్నవరం వ్యాప్తంగా..

గన్నవరం: క్రిస్మస్ పర్వదిన వేడుకలను గన్నవరం ప్రాంతంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అద్భుత బాలఏసు ఆర్సీఎం చర్చిలో అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. విచారణకర్త ఫాదర్ పసల థామస్ నేతృత్వంలో బాలఏసు రాకను స్వాగతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విజయవాడ బిషప్ హౌస్ నుంచి వచ్చిన ఫాదర్ వినోద్ భక్తులకు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చిలో తెల్లవారుజామున సంఘకాపరి జీవమనోహర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సంఘ సభ్యులతో కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు. స్థానిక గ్రేస్ ఫెలోషిప్ మినిస్ట్రీస్ చర్చిలో వ్యవస్థాపకులు పాస్టర్ గుండ్రపు సురేష్‌బాబు నేతృత్వంలో వేడుకలను నిర్వహించారు. తొలుత సంఘ పెద్దలు బొకినాల కోటేశ్వరరావు, కాటూరి వెంకటేశ్వరరావు, సుందరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు. స్థానిక ఇవాంజిలికల్ ఫెలోషిప్ చర్చిలో పాస్టర్ కలపాల జోసఫ్ డేనియల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రార్థనలు జరిగాయి.



గన్నవరంలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ సురేష్, సంఘ పెద్దలు

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్..

ఉయ్యూరు: క్రిస్మస్ పండుగను అంతటా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో బుధవారం క్రీస్తును స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందంగా గడిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆధ్వర్యంలో క్రీస్తు విశ్వాసులు, ప్రార్థనా మందిరాలకు మిఠాయిలు పంచారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, తదితరులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

లోక రక్షణార్థం క్రీస్తు జననం

ఉంగుటూరు: లోక రక్షణార్థమై క్రీస్తు జన్మించాడని ఇది ప్రతి ఒక్కరి పండుగ అని ఫాదర్ జోసఫ్ పాలడుగు అన్నారు. పెద్ద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి జరిగిన జానంపేట, వియాన్ని కాలేజ్ రెవ.ఫాదర్ ప్రవీణ్ గోపు దివ్యపూజను సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో విచారణ ఫాదర్ అభిలాష్ గోపు, సిస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు. అదే విధంగా తేలప్రోలు, ఆత్కూరు, ఉంగుటూరు, మానికొండ, ఇందుపల్లి తదితర గ్రామాల్లో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

రామవరప్పాడులో..

రామవరప్పాడు: రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని చర్చిల్లో ఉదయం నుంచే క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. నిడమానూరులో సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్‌లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో ఏసుక్రీస్తు రాకను స్వాగతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. ముస్తాబాద కొండపై ఉన్న ఏసు దివ్యకారుణ్య మూర్తి పుణ్యక్షేత్రంలో, స్థానిక సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తెంపల్లి, వీరపనేనిగూడెం, చిన అవుటపల్లి, చిక్కవరం, గోపవరపుగూడెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం, సూరంపల్లి గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపదేశికులు సందేశమిస్తూ మానవాళి రక్షణకు క్రీస్తు ఈ లోకానికి వచ్చారని, ఆయన మార్గం అనుసరణీయమన్నారు.



రంగన్నగూడెం సీఎస్ఐ చర్చిలో..

జంక్షన్‌లో ప్రార్థనలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలను విద్యుత్ దీపాలు, క్రిస్మస్ స్టార్‌లతో అలంకరించారు. ఏసుక్రీస్తు జననాన్ని తెలియజేసే పశువుల పాక, దేవదూతల ప్రతిమలను ఏర్పాటు చేశారు. స్థానిక జ్యోతినగర్ ఆర్సీఎం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఫాదర్ జోసఫ్ తంబి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. జేఎంజే సిస్టర్స్ క్రిస్మస్ గీతాలను సుమధురంగా ఆలపించారు. పరిశుద్ధ సీయోను సీఎస్ఐ చర్చి, సీఎస్ఐ టౌన్‌చర్చి, హోసన్నా మందిర్, కారుణ్య ప్రార్థనా మందిరం, బేతేలు చర్చి, వేలేరు కల్వరి శక్తి మినిస్ట్రీస్ చర్చిలలో అధిక సంఖ్యలో క్రైస్తవులు ప్రార్థనలకు హాజరయ్యారు.



చిన్నారులతో నిర్వాహకులు



పెనమలూరులో కేక్ కట్ చేస్తున్న దేవభక్తుని చక్రవర్తి



కానూరు కార్మెల్ పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ వేడుకలు



పెద్ద అవుటపల్లిలో పశువుల పాకను తిలకిస్తున్న భక్తులు

జాతీయ రహదారిపై భవనం తొలగింపు

పెనమలూరు: విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారి పక్కనే ఉన్న పాత భవనాన్ని అధికారులు బుధవారం తొలగించారు. గత 10 ఏళ్ల క్రితం పోరంకి పరిధిలో విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారిపై బందరు రోడ్డును 150 అడుగులుగా విస్తరించారు. అయితే కుటుంబ వివాదాల కారణంగా తూముల సెంటర్‌లో ఒక భవనం తొలగించలేదు. దాదాపు పదేళ్లుగా భవనం అలాగే ఉండి పోయింది. అయితే కుటుంబ వివాదం పరిష్కారం కావటంతో భవనం తొలగింపునకు లైన్‌క్లియర్ అయింది. నష్టపరిహారం కింద దాదాపు రూ.1.30 కోట్లు భవన యజమానికి ప్రభుత్వం అందజేసింది. దీంతో రోడ్డు విస్తరణ పరిధిలో ఉన్న భవనాన్ని జేసీబీతో నేలమట్టం చేశారు. పోరంకి పరిధిలో ఇంకా ఒక శ్మశాన వాటిక భవనం, మరో పాత భవనం, గుడి, ప్రార్థన మందిరం భవనం రోడ్డు విస్తరణ పరిధిలో ఉన్నాయి. వీటి తొలగింపు ఎప్పుడు జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా ఉంది.




పోరంకిలో భవనం కూల్చివేత పనులు పరిశీలిస్తున్న ఎన్‌హెచ్ఐ అధికారులు


శిథిలావస్థలో ఏలూరు కాలువపై వంతెన

- వందేళ్ల క్రితం నిర్మించిన వైనం
- బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్న ప్రజలు
- వంతెన నిర్మాణం చేపట్టాలని వినతి

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో ఏలూరు కాలువపై బ్రిటిష్ పాలకుల కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్దాలుగా ఈ వంతెనకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో కూలిపోయే స్థితికి చేరుకుంది. వంతెనపై రెయిలింగ్ గోడలు దెబ్బతినడంతో పాటు పిచ్చిమొక్కలు మొలిచి గోడలు బీటలు వారాయి. దీనికితోడు పరిమితికి మించిన లోడుతో భారీ వాహనాలు వంతెనపై రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. సుమారు వందేళ్ల క్రితం గానుగ సున్నం, రాతిరాయితో ఈ వంతెనను నిర్మించారు. కేసరపల్లి వద్ద జాతీయ రహదారి బైపాస్ నిర్మించక ముందు విజయవాడ–ఏలూరు మధ్య వాహనాలు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగించేవి. ప్రస్తుతం గన్నవరం నుంచి కేసరపల్లి మీదుగా ఉప్పులూరు, తెన్నేరు, మంతెన, పునాదిపాడు, కంకిపాడు వెళ్లేందుకు ఈ వంతెన ఉపయోగపడుతుంది. అంతే కాకుండా కేసరపల్లి రైతులు ఏలూరు కాలువ అవతల పంట పొలాలకు వెళ్లేందుకు, పండించిన పంటలను గ్రామానికి తీసుకువచ్చేందుకు ఈ వంతెన ప్రధాన ఆధారం. గతంలో కృష్ణానది పుష్కరాల సమయంలో కంకిపాడు – కేసరపల్లి మధ్య ఆర్ అండ్‌బీ రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించిన ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని మాత్రం విస్మరించింది.



బీటలు వారిన వంతెన గోడ



వంతెన గోడలపై మొలిచిన మొక్కలు

భయం.. భయంగా ప్రయాణం

శతాబ్ద కాలం క్రితం నిర్మించిన ఈ వంతెనపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సుమారు 30 నుంచి 40 టన్నుల సామర్థ్యం కలిగిన ఇసుక, గ్రావెల్ టిప్పర్లు కూడా ఈ వంతెనపై వెళ్తున్నాయి. దీంతో పునాదులు బలహీనపడుతుండడంతో పాటు వంతెన గోడలు కూడా క్రమంగా దెబ్బతింటున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ నిర్వహణ లోపం కారణంగా వంతెన గోడలు, రెయిలింగ్‌పై పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా తయారైంది. దీనివల్ల వంతెన క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని పలుమార్లు ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. దీంతో వంతెన ఎప్పుడు కూలుతుందోననే భయంతో బిక్కుబిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నామని గ్రామస్తులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వంతెన పునర్నిర్మాణం దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

కేసరపల్లి వద్ద ఏలూరు కాలువపై రూ.35 కోట్లతో కొత్త వంతెన నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నాబార్డు నుంచి నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి పంపాం. ఈ వంతెనపై వాహనాల రాకపోకలు కూడా బాగా పెరిగాయి. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– శ్రీహరి, ఆర్అండ్‌బీ ఏఈ, గన్నవరం

సీఎంఆర్‌ఎఫ్ నిధుల మంజూరు

గన్నవరం: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి వైద్య చికిత్సల నిమిత్తం రూ.2.85 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. ఈ మేరకు బుధవారం శాసనసభ్యుని క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబాలకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య చికిత్సల నిమిత్తం నున్న గ్రామానికి చెందిన మాణిక్యంకు రూ.2.25 లక్షలు, మానికొండకు చెందిన బెజవాడ కృష్ణారావుకు రూ.60 వేలు మంజూరయ్యాయన్నారు. వైద్య సహాయం కోసం సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు కోసం పేదలు తన క్యాంప్ కార్యాలయాల్లో సంప్రదించాలని యార్లగడ్డ సూచించారు.



ఎల్ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

కాకాని సేవలు చిరస్మరణీయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో విద్య, వ్యవసాయం, పాడిపరిశ్రమ రంగ అభివృద్ధిలో కాకాని వెంకటరత్నం సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, జై ఆంధ్ర ఉద్యమనేత, మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం వర్ధంతి సభ బుధవారం బెంజిసర్కిల్‌లోని ఆయన విగ్రహం వద్ద జరిగింది. తొలుత పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రాను ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలని 70వ దశకంలోనే కాకాని డిమాండ్ చేశారని, అప్పుడే అలా జరిగితే ఇప్పటికి రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదన్నారు. మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందు జిల్లాలో 9 పాఠశాలలు మాత్రమే ఉండేవని, వెంకటరత్నం మంత్రి అయిన తర్వాత 180 పాఠశాలలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బెంజిసర్కిల్‌కు కాకాని సర్కిల్‌గా నామకరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు తరుణ్ కాకాని మాట్లాడుతూ కాకాని ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముసునూరి రత్నబోస్, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్(న్యూఢిల్లీ) చైర్మన్ నాగులపల్లి భాస్కరరావు, కలపాల వినయ్‌సాగర్, గోగినేని ధనశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలపాల సూర్యప్రకాశరావు జీవిత అనుభవాలకు సంబంధించి ఆయన కుమారుడు వినయ్‌సాగర్ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, తరుణ్‌కాకాని, రత్నబోస్, రవి తదితరులు

ఘాట్లలో దీక్ష వస్త్రాల తొలగింపు వేగవంతం చేయాలి

పటమట(విజయవాడతూర్పు): భవానీ దీక్షల విరమణ ఆఖరి రోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున వీఎంసీ సిబ్బంది ఘాట్లలో దీక్ష వస్త్రాల తొలగింపు పనులను వేగవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆయన బుధవారం తెల్లవారుజామున భవాని దీక్ష విరమణ ఏర్పాట్లను కృష్ణవేణి ఘాట్, సీతమ్మ పాదాలు, హోల్డింగ్ ఏరియా, వినాయకుని గుడి, కెనాల్ రోడ్, దుర్గా ఘాట్, మోడల్ గెస్ట్ హౌస్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ భవాని దీక్షల విరమణకు వచ్చిన భక్తులు అధికంగా ఉండటంతో రాత్రి వేళలో కూడా భక్తులకు కల్పించే సౌకర్యాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఘాట్లలో భక్తులు విడిచిన దీక్ష వస్త్రాలను ఎప్పటికప్పుడు తొలగించి కన్వేయర్ బెల్ట్ ద్వారా ఒడ్డుకు చేరి అక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. వస్త్రాలను తరలించే వాహనాల సంఖ్య కూడా పెంచాలని, భక్తులకు కల్పించే తాగునీటి సరఫరాలో కూడా అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు ఎప్పటికప్పుడు తాగునీటి స్టాక్ పాయింట్ పరిశీలించాలని, వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన దుర్గా ఘాట్ వద్ద గల మోడల్ గెస్ట్ హౌస్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌లో ఉండే సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరా ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు.



కృష్ణవేణి ఘాట్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంద్రకీలాద్రి ఆలయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భవానీ దీక్షల విరమణ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలు అందించినట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ బుధవారం తెలిపారు.